# సుమిత్రగారిల్లు

"ఏమండోయ్ రావుగారూ! మా ఇల్లు సంగతి ఏంటండీ బాబూ? మీ కేం హాయిగా ఇల్లు కట్టేసుకున్నారు. సొంత ఇంట్లో నిశ్చింతగా కాలుమీద కాలేసుకుని కూర్చుంటున్నారు. కాస్త మా క్కూడా ఆ యోగం కల్పించండి మహాశయా, అంటే పట్టించుకోరేం సార్?" వడివడిగా అనేసింది మా కొలీగ్ సుమిత్ర.

"మరీ అన్యాయంగా మాట్లాడేస్తున్నారు సుమిత్రగారూ. గత నాలుగు ఆదివారాలుగా మీరు వస్తారని పనులన్నీ మానుకుని ఇంటి దగ్గర ఉండిపోతే, ప్రతిసారీ 'సారీ' అండీ రాలేకపోయాం అంటూ సాకులు చెప్పిన మీరు, నేను పట్టించుకో లేదంటారే?" విస్మయం నటిస్తూ అన్నాన్నేను.

"కాదు గానీండి. రేపు నిజంగా వచ్చేస్తాం. ఎన్ని పనులున్నా పక్కకు నెట్టి రేపు కచ్చితంగా మీ ఇంటికి వచ్చేస్తాం. సరేనా"

"అయిదో ఆదివారం...." గొణిగినట్లుగా అన్నాను.

"ఎక్కడండీ బాబూ, ఆదివారం అనగానే కాస్త అలస్యంగానే నిద్రలేవడం అవుతుంది. నిద్ర లేస్తూనే టీ.వీ. ముందు కూర్చుం

టారు మావారు తొమ్మిది గంటలకు భారతం. తర్వాత మరొకటి. అవీ, ఇవీ చూశాక స్నానం. భోజనం వగైరాలన్నీ అయిపోయాక అందరూ పడుకునే వేళ. 'ఇప్పుడేం వెళ్తాం' అంటూ తనూ పడు కుంటారు. సాయంత్రానికి టిఫిన్లూ, కాఫీలూ పూర్తయ్యేసరికి మణ్ణీ సినిమా ప్రారంభం అవుతూ ఉంటుంది. అప్పటికీ నేను హెచ్చరి స్తూనే ఉంటాను. ఏం లాభం? వచ్చే వారం వెళ్దాం లెద్దూ అంటూ తను బద్ధకించడమే కాకుండా. నాక్కూడా బద్ధకం వచ్చేలా చేస్తుంటారు."

"దాంతో ఒకరి కంటె ఒకరు పోటీ పడి బద్ధకించి మా చెవిలో పూవు పెడుతుంటారు" నవ్వుతూ అన్నాను.

"రేపు సాయంత్రం తప్పకుండా వచ్చేస్తాంగా." అని వెళ్ళి పోయింది సుమిత్ర.

నేను పనిచేసేది ఓ ప్రభుత్వ కార్యాలయంలో మా సహో ద్యోగుల్లో చాలామందిమి ఇల్లు కొనుక్కోవటమో, కట్టుకోవడమో చేశాం. ఓ పది, పదిహేను మంది కాబోలు అద్దె ఇళ్ళల్లో ఉంటూ రకరకాల ఇబ్బందులనూ. అనుభవాల్నీ ఎదుర్కొంటున్నారు. అలాంటి వాళ్ళల్లో సుమిత్ర కూడా ఉన్నది. అవిడకు ఇటీవలి కాలంలో సొంత ఇల్లు ఏర్పరచుకోవాలనే కోరిక బాగా ఏర్పడింది.

ఇటీవలి కాలంలో ఇల్లు కట్టుకున్న వాడిని కావడంతో ఓ రోజు నన్ను సలహా అడిగింది సుమిత్ర - "ఇల్లు కట్టుకోవడం మంచిదంటారా? కొనుక్కోవడం నయమంటారా?" అని.

"నన్నడిగితే మనం కట్టించుకోవడమే బాగుంటుంది సుమిత్ర

గారూ. మన అభిరుచుల మేరకు, మనకి నచ్చిన విధంగా, మనకి సౌకర్యంగా ఉండే పద్ధతిలో కట్టుకోవచ్చు" చెప్పాన్నేను.

"మీరు చెప్పింది నిజమే కాని.. ఇల్లు కట్టించడం మాటలా? ఆ మునిసిపల్ ఆఫీసు చుట్టూ తిరిగి ప్లాన్లు, గట్రా సంపాదించేసరికి తలప్రాణం తోకకి వస్తుంది. అయినా మీ కంటే మీ బ్రదర్స్, వాళ్ళూ ఉన్నారు కాబట్టి తలా ఓ పనీ చూసుకున్నారు. మా ఇంట్లో అలా కాదుగా. ఏ పనికి వెళ్ళాలన్నా ఆయన నొక్కరే. పైగా, ఆ మునిసిపల్ అఫీసు, వాళ్ళ లంచాలు అంటేనే మా వారికి ఒళ్ళు మండిపోతుంది. ఆయ నసలే ఒప్పుకోరు.

"అవసరం మనది మేడమ్. ఇష్ట మున్నా, లేకపోయినా ఇల్లు కట్టుకోవా లనుకున్నప్పుడు మరి తప్పుతుందా? మునిసిపల్ ప్లాన్ అప్రూవ్ కావలసిందే. అప్రూవ్డ్ ప్లాను పంపితే కానీ మనకు లోన్ ఇవ్వరు. లోన్ లేకుండా ఇల్లు కట్టడం మనవల్ల కాదు.

"అందుకే ఈ తిరకాసు లన్నీ తెలుసు కాబట్టే అందరి దగ్గర కంటే మన దగ్గర మరో నాలుగు వందలు ఎక్కువే కాజేస్తారు మునిసిపల్ వారు. తీసుకుంటే తీసుకున్నావు పని త్వరగా చేసిపెట్ట వయ్యా బాబూ అంటే చూద్దాం, చేద్దాం అంటూ తిప్పుకుంటారే తప్ప, పని మాత్రం జరగదు. అడుగడుగునా లంచాలు కుమ్మరిస్తూ వాళ్ళ నోళ్ళు మూయించాల్సిందే తప్ప మరో మార్గం లేదు." నే పడిన కష్టాలన్నీ గుర్తుకు వచ్చి నా కసినంతా ఆమె ముందు వెళ్ళ బోసుకున్నాను.

అందుకే సుమిత్ర, ఆమె భర్త కూడా కట్టిన ఇంటిని కొనుక్కోవడానికే ఇష్టపడ్డారు. మా ఏరియాలో కొన్ని ఇళ్ళు అమ్మకానికి ఉన్నాయని నాకు తెలిసిన బ్రోకరు ద్వారా విన్నాను. సుమిత్రా వాళ్ళకి ఆ ఇళ్ళు చూపించే కార్యక్రమం గత నాలుగు వారాలుగా వాయిదా పడుతూ, చివరికి రేపటికి ముహూర్తం కుదిరింది మళ్ళీ.

★ ★ ★

"అయ్యా, స్థలం ఎక్కువగా ఉండి పెద్ద ఇల్లున్నవి చూపమంటారా? ఖాళీ స్థలం లేకపోయినా ఫరవాలేదా? అసలు మీకు ఎలాంటి ఇళ్ళయితే బాగుంటా యనుకుంటున్నారో చెపితే అలాంటివే చూద్దాం మరి." అడిగాడు బ్రోకరు నారాయణ.

"ఇలా ఉండాలి అని కాదు గాని మరీ పాత ఇళ్ళు, పెంకుటిళ్ళు కాకుండా, కనీసం నాలుగు గదులు. ఓ పంచ ఉండే ఇళ్ళు చూపించు నారాయణా" అన్నాన్నేను.

"ఖాళీ స్థలం కూడా ఉండాలి. మరీ స్థలం అంతా ఇల్లేఅయితే బాగుండదు." తన అభిప్రాయం చెప్పాడు వినోద్ - సుమిత్ర భర్త.

సుమిత్ర బలవంతం చేయడంతో ఆమెకు కాలక్షేపంగా ఉంటుందనే ఉద్దేశంతో మా శ్రీమతి కూడా బయలు దేరింది. బ్రోకరు నారాయణతో పాటు అయిదుగురం నడక ప్రారంభించాం.

మా ఇంటి నుంచి చాలా దూరం నడిచాం కాని గమ్యం చేరలేదు. ఒక్క గుమ్మం లోపలికి వెళ్ళనూ లేదు.

"అబ్బో. ఇంత దూరంగానా?" అంటూ పెదవి విరిచింది సుమిత్ర.

"దూరాని దేముందండీ సుమిత్రగారూ! ఇదంతా నిజానికి పెద్ద సెంటర్ ఈ పేటలో సిటీబస్ కూడా ఇక్కడదాకా వస్తుంది. ఇక్కడ మీకు దొరకని వస్తువు లేదు. ఆఫీసులకు వెళ్ళేందుకు మీకు స్కూటర్ కూడా ఉంది కదా. ఇంకా దూరం ఏమిటండీ?" అన్నాను ఆమెలో నిరుత్సాహాన్ని పోగొట్టే ప్రయత్నంగా.

"అదిగోనండీ! ఆ పచ్చరంగు వేసిన డాబా లేదూ, అదే మనం చూడబోయే ఇల్లు." అంటూ కొద్ది దూరంలో కనిపిస్తున్న ఒక ఇంటిని చూపిస్తూ చెప్పాడు బ్రోకరు నారాయణ.

పెద్దగా ఓ నిట్టూర్పు విడిచింది సుమిత్ర.

మేం అందరం ఆ ఇంటి ముందు ఆగడంతోపాటే పాపం ఆ ఇంట్లో ఉన్న వ్యక్తులంతా హడావిడిగా అక్కడ చిందరవందరగా ఉన్న మంచాలు, దిండ్లు వగైరా అన్నింటినీ సర్దుతూనే రమ్మని ఆహ్వానించారు. నారాయణను చూడగానే మేం ఏ పనిమీద వచ్చిందీ తెలిసిపోయింది వాళ్ళకు.

ఇంటి చుట్టూ ఖాళీ స్థలం ఉన్నది. ఓ మూలగా బావి, చుట్టూ కాంపౌండ్. రెండు భాగాల ఇల్లు. మరీ పాతదీ కాకుండా అంత కొత్తదీ కాకుండా మధ్యస్థంగా ఉన్నది ఇల్లు. సౌకర్యాలన్నీ ఉన్నప్పటికీ, చూడగానే ఎందుకనో ఆకర్షణీయంగా కనిపించలేదు ఆ ఇల్లు నాకు.

"లోపలికి వెళ్ళి చూడండి. పరవాలేదు లోపలికి రండి."

అంటూ బలవంతం చేశాడు నారాయణ ముందుగా లోపలికి నడుస్తూ.

అలవాటు లేని వ్యవహారం కావటంతో మొహమాట పడుతూ ఇబ్బందిగా ఇంట్లోపలికి వెళ్ళాం అందరం.

గోడలు, పైకప్పు పగుళ్ళు ఇచ్చినయ్యేమోనని నిశితంగా చూశాం. అంతా బాగానే ఉంది. వంట గదిలో అల్మారాలు. అట కలు ఉన్నాయి. ఇంట్లోకి గాలి, వెల్తురు బాగానే వస్తున్నాయి. మెట్లు ఎక్కి డాబా మీదకు వెళ్ళాం.

"ఎండా కాలంలో హాయిగా పడుకోవచ్చు" అన్నారు వినోద్

ఇల్లంతా మరోసారి కలియచూసి రోడ్డు మీదకు వచ్చి నిల్చున్నాం.

అక్కడి నుంచి మరో ఇంటికి ప్రయాణం అయ్యాం. దారిలో నారాయణ చెప్పిన మాటలు - "వాళ్ళ అమ్మాయికి పెళ్ళి చేయాలనుకుంటున్నారు. చూసిన రెండు మూడు సంబంధాల్లో బహుశా ఒకటి ఖాయం కావచ్చు. పెళ్ళికక్కావలసిన కట్నం, ఖర్చుల కోసం ఇంటిని అమ్మకానికి పెట్టారట. మగ పిల్లలు ముగ్గురూ ఉద్యోగాలు చేస్తూ సంపాదిస్తున్నా, చెల్లెలు పెళ్ళికి సంబంధాలు చూడటం వరకే బాధ్యత తీసుకున్నారట గాని, కట్నానికి, ఖర్చులకూ డబ్బు సమకూర్చటం వాళ్ళ వల్ల కాదన్నారుట. అందుకే ఇష్టం లేకపోయినా ఇల్లు అమ్మకానికి పెట్టక తప్పలేదు పెద్దాయనకు.

"ఎన్ని అవస్థలు పడి కట్టుకున్నాడో పాపం! ఎంత శ్రద్ధగా చూసుకున్నాడో ఇప్పటివరకూ!? మనసులోనే అనుకున్నాన్నేను.

విచారంగా ఉన్న ఆ ముసలాయన వదనం నా కళ్ళముందు కదలాడిం దో సారి.

రెండో ఇంటిముందుకు వెళ్ళాం. నారాయణే ముందుగా లోనికి నడిచాడు.

ఆ ఇంట్లో ఉన్నవాళ్ళు ఎవరూ చొరవ, శ్రద్ధ చూపకుండా నిర్లిప్తంగా ఉండిపోయారు.

ఇల్లు మాత్రం అధునాతనంగా కట్టించారు. బయట నుండి చూస్తుంటే చాలా ఆకర్షణీయంగా ఉంది. ఆ ఇల్లు సుమిత్రకు నచ్చి నట్లుంది. లోపలికి వెళ్ళి చూడాలని తాపత్రయ పడుతోంది.

లోపలికి వెళ్ళాం. మొజాయిక్ ఫ్లోరింగ్‌తో నేల మెరిసిపో తున్నది నున్నగా. రంగులతో కళకళలాడి పోతున్నాయి తలుపులు. కావలసింత ఖాళీస్థలం. రెండు బెడ్‌రూములు, అటాచ్‌డ్ బాత్రూమ్స్ వంట గది, పెద్ద హాలు. వరండా. డాబాపైన మరో రెండు గదులు. ఎక్కడికక్కడే కుళాయిలు, వాష్ బేసిన్‌లు. ఇల్లంతా నీట్‌గా, క్లాస్‌గా కన్పిస్తున్నది.

వంట గదిలో ప్రత్యేకంగా ఉన్న పూజా మందిరం మరింత ఆకర్షణీయంగా అనిపించింది సుమిత్రకు. ఇల్లు ఆమెకు బాగా నచ్చి నట్లు ఆమె ముఖ కవళికలు చెప్పక చెబుతున్నాయి.

వినోద్‌కు కూడా సంతృప్తిగా ఉన్నట్లుగా మాట్లాడాడు నాతో రహస్యంగా

బయట కూర్చున్న వ్యక్తి దగ్గరకు నడిచాన్నేను.

"మీరు ఏం చేస్తుంటారు?" అడిగాన్నేనే.

చేసే ఉద్యోగం చెప్పాడతను.

"ఈ ఇంట్లో ఎప్పట్నుంచి ఉంటున్నారు?"

"కట్టినప్పటి నుంచి మేమే ఉంటున్నాం. మూడేళ్ళనుంచీ" చెప్పాడతను.

నా గురించీ, వినోద్, సుమిత్రల గురించీ అతను అడక్కుండానే చెప్పాను

"ఏమిటో మరి చాలామంది చూసి వెళ్తున్నారుగానీ ఎవరూ కొనటంలేదు ఎందుకో అన్నాడతను.

ఇంటి యజమాని హైదరాబాదులో ఉంటున్నట్లు ఏదో వ్యాపారం చేస్తున్నట్లు చెప్పాడు.

"బేరం కుదిరిన తర్వాత కూడా ఇద్దరు ముగ్గురు కొనకుండా మానుకున్నారు ఎందుకో?" చెప్పాడతను.

అతని మాటల్లో ఏవేవో భావాలు స్ఫురించాయి నాకు.

"ఇక వెళ్దామా?" అంటూనే బయటకు వచ్చారు మా శ్రీమతి, సుమిత్ర, వినోద్.

"మళ్ళీ కలుస్తానండీ" అంటూ అతని దగ్గర సెలవు తీసుకుని బయలుదేరాను.

"ఇంత బాగా కట్టుకున్న ఇల్లు ఎందు అమ్ముకుంటున్నారో?" సందేహం వెలిబుచ్చింది సుమిత్ర.

"అదే నాకూ అర్థం కావటంలేదు" అన్నాడు వినోద్.

"ఆయనకి వ్యాపారంలో డబ్బు కావల్సి వచ్చిందట బాబూ! అందుకే ఓ వెయ్యి అటో, ఇటో తొందరగా అమ్మేసేయాలనే ఆలో చన్లో ఉన్నాడాయన." అనుమానం తీర్చాడు నారాయణ.

"కొంతమంది కేవలం లాభానికి అమ్ముకోవటానికే కడుతుంటారుగా. ఇది అలా కట్టించాడేమో! అలాంటి ఇళ్ళకు గట్టిదనం వుండదు బాబూ. ఊరికే పైపైన షోకేతప్ప పునాదులూ, గట్రా శ్రద్ధగా చేయించరు." తన భయాన్ని బయట పెట్టింది సుమిత్ర.

"ఆ వివరాలన్నీ పూర్తిగా కనుక్కున్న తర్వాతనే కొనుక్కోవచ్చు గానీ ముందసలు ఇల్లు బాగా నచ్చిందా మీకు?" సుమిత్ర దంపతుల నుద్దేశించి అడిగాను.

"ఇంటికేం, అద్భుతంగా వుంది." అని సుమిత్ర, "ఇల్లు సింప్లీ సూపర్బ్, అంత ఓర్పుగా నేర్పుగా కట్టించడం మన వల్ల కాదు." అని వినోద్ తమ అభిప్రాయాలు చెప్పారు.

తిరిగి తిరిగి కాళ్ళీడ్చుకుంటూ అందరం మా ఇంటికి చేరాం.

ఆ ఇంటిని గురించిన వివరాలన్నీ కనుక్కోమని నాకు పదే పదే చెప్పి వెళ్ళిపోయారు సుమిత్ర, వినోద్.

★ ★ ★

"ఆ ఇంట్లో అద్దెకుంటున్న మనిషి అలా చెప్పాడేం నారాయణా?" అడిగాను.

"అద్దెకుంటున్న వాళ్ళు ఎప్పుడైనా అలాగే చెప్తారండీ

బాబూ!యజమానికి పెద్ద వ్యాపారం ఉంది. ఇల్లయితే కట్టించాడు గాని దాని మీద పూర్తిగా శ్రద్ధ చూపలేకపోవటంతో. అద్దె కూడా చాలా చౌకగా ఇచ్చేశాడు. మరి అంత మంచి ఇల్లు అంత చౌకగా వాళ్ళకి దొరకదు కదా. అందుకే కొనాలని చూసేందుకు వచ్చే వాళ్ళందరికి అలాగే చెప్తుంటాడాయన.

"అంతేనంటారా?" సందేహంగా అడిగాను.

"అంతేనా ఏంటండీ? అసలు నాకీ మధ్య తెలిసిన విషయం ఏమిటంటే వాళ్ళే ఆ ఇల్లు కొనుక్కోవా లనుకుంటున్నారట. వాళ్ళకి ఏదో ఊళ్ళో పొలం ఉందిట. అది అమ్మేసి ఈ ఇల్లు కొనుక్కోవా లనుకుంటున్నారని విన్నాను... ఆఁ...." రహస్యం చెప్పినట్లు మెల్లగా చెప్పాడు నారాయణ.

"పోయిన సారి ఓనరుగారు వచ్చినప్పుడు ఈయనగారు కొన టానికి వచ్చిన వాళ్ళందరికి ఇలా చెప్పాడని కూడా చెప్పాను. 'ఏం చేస్తాం నాయనా ఇల్లు ఖాళీ చేయమంటే అదిగో, ఇదిగో అంటూ కాలం గడుపుతున్నాడు. ఎటూ అమ్ముతున్నాను కదా! బేరం కుదిరితే వాడే ఖాళీ చేస్తాడని నేనూ ఊరుకుంటున్నాను" అన్నాడాయన నారాయణ చెప్పాడు.

మరి కాసేపు ఇళ్ళు, అమ్మకాలు, కట్టడాలు, కష్ట నష్టాలు మాట్లాడి, చూసొచ్చిన ఇల్లు సుమిత్ర వాళ్ళకి బాగుంటుందని ఆ ఇంటి సౌకర్యాల గురించి, పరిసరాల్లో ఉన్న వసతుల గురించి మరోసారి చెప్పి వెళ్ళిపోయాడు నారాయణ.

'కమీషన్ కోసం వాడి ఆరాటం వాడిది' అనుకోకుండా ఉండలేకపోయాను.

★ ★ ★

అన్ని రకాలుగా ఆ ఇల్లు నచ్చడంతోనూ, అనుకున్న ధరకు అందుబాటులో ఉండటంతోనూ ఆ ఇల్లు కొనుక్కోవాలని నిర్ణయించుకున్నారు సుమిత్ర, వినోద్. వారి బంధువుల్ని తీసుకువచ్చి మరో రెండుసార్లు ఇల్లు చూసి వెళ్ళారు.

పిల్లలకు, కాన్వెంట్ దూరం అవుతుందనీ, అంత దూరం చిన్నపిల్లలు వెళ్ళి రావడం కష్టమనీ, అందుకోసం మరో రెండు మూడు సంవత్సరాలు ఇప్పుడు తాము ఉంటున్నచోటే అద్దెకు ఉంటూ కొనబోయే ఇంటిని కింద ఒకరికి, డాబా పైన రెండుగదులు మరొకరికి అద్దెకిచ్చేయాలని నిర్ణయించుకున్నారు. ఆ ఆలోచన సౌకర్యంగానూ, లాభదాయకంగానూ ఉండటంతో వెంటనే బయానా లివ్వడం, కాగితాలు రాసుకోవడం వగైరా కార్యక్రమాలు పూర్తి చేసేశారు.

తనకి రావలసిన కమీషన్‌లో కొంత అడ్వాన్సుగా తీసుకున్న నారాయణ తెగ సంబరపడిపోయాడు. రెండువైపులా చెరి కొంత తీసేసుకున్నాడు నారాయణ.

★ ★ ★

ఆనందోత్సాహాల మధ్య వేడుకగా గృహప్రవేశం కార్యక్రమం పూర్తయింది. బంధువులు, మిత్రులు అందరూ ఇంటిని మెచ్చుకున్నారు. చిన్న చిన్న మార్పులకు, చేర్పులకు సలహాలిచ్చారు. ఓ

వారం' పది రోజులు సొంత ఇంట్లో గడిపి, ముఖ్యమైన బంధువు లందరూ తిరిగి వెళ్ళిపోయాక ఆ ఇంటికి 'టు లెట్' బోర్డు తగిలించి అద్దె ఇంటికి వచ్చేశారు సుమిత్ర వాళ్ళు. నాలుగైదు రోజులకే కింద పోర్షనుకు అద్దెకు వచ్చారు. మరో వారం, పది రోజుల తర్వాత పై రెండు గదుల్లోకి కూడా అద్దెకు వచ్చేశారు. అప్పుడప్పుడు వెళ్ళి ఇంటిని చూసుకుని వస్తున్నారు భార్యా భర్తలు.

చిన్న చిన్న మార్పులతో మరింత అకర్షణీయంగా. అందం గా తీర్చిదిద్దారు ఇంటిని ఇంటి ముందూ, వెనుక ఖాళీ స్థలంలోనూ రకరకాల పూలమొక్కలు పెట్టారు. రెండు పోర్షన్లలోకీ ఉద్యో గస్థులే అద్దెకు రావడంతో, నెల నెలా ఒకటవ తేదీనే ఠంచనుగా అద్దె వసూలవుతున్నది.

పిల్లల చదువులకు ఇబ్బంది లేకుండా, వాళ్ళకీ ఆఫీసులకి దూరం కాకుండా, అలవాటైన చోటనే ఆనందంగా, హాయిగా కాలం గడుపుతున్నారు సుమిత్రా వాళ్ళు.

కాలచక్రంలో మరో మూడు సంవత్సరాలు దొర్లిపోయి నాయి.

మాల్థస్ జనాభా సిద్ధాంతంలా జీతాలు, ధరలు పెరిగిపోయి నాయి. ఆనాడు సుమిత్రా వాళ్ళు కొన్న ఇంటి ఖరీదు ఇప్పుడుదాదాపు రెట్టింపయింది.

వినోద్‌కు ప్రమోషను వచ్చి హైదరాబాద్‌కు బదిలీ అయింది. తను కూడా అక్కడికే ట్రాన్స్‌ఫర్ కావాలంటూ అప్లికేషన్ పెట్టు కుంది సుమిత్ర కొద్ది కాలనికే హైదరాబాదు వెళ్ళిపోయారు వాళ్ళు.